అడినోవా

ఊరికే ఉన్న ప్రాణానికి ఉరి పెట్టుకోవడమంటారే – సరిగ్గా అదేనండీ ... నేను చేజేతులారా చేసుకున్నాను.

అవున్నిజం!! అది 'ఎట్లా?' అని మీరు నన్ను అడగకుండా ఊరుకోరు – నాకు తెలుసు...

చెబుతా చెబుతా – మీరు కొంచెం ఓపిగ్గా వింటే .... మొదట్నించీ వివరంగా చెబుతాను.

ఆc... ఆ రోజూ.... 'అంటే – ఏ రోజు?' అని మీరు నన్నడక్కూడదు – ఎందుకంటే నా 'కర్మ రోజు' ఏ రోజైనా ఒక్కటేగా – అందుకే – 'ఆ రోజు'తో ప్రారంభిస్తాను.

ఆ రోజు నాకు ఏ పాడు బుద్ధి పుట్టిందో ఏమిటో తెలియదుగాని – మేము టీ.వీ.ని కొన్న నాటి నుంచి ఏ పొద్దూ దాన్ని ఆన్ చేసి, ఏ ఒక్క ఛానల్నీ కంటిన్యూగా ఐదు నిమిషాలపాటూ చూసి ఎరగను. దానిక్కారణం నేను రెవిన్యూ శాఖలో ఉద్యోగిని అవడమే! నన్ను 'కర్మ' అట్లా తోసుకుని వస్తూవుంటే ఏం చేయగల్ను.

టీ.వీ.ని ఆన్ చేశాను. చిన్ని తెరమీద ఉపగ్రహ టీ.వీ. ఒకటి ప్రత్యక్షమయింది. పోనీలే మా ఆవిడ టిఫిన్ రెడీ చేసేటంత వరకూ కాసేపు ఆకల్ని మరచిపోయి ఉండవచ్చుకదా అన్న దురుద్దేశంతో చూడసాగాను.

తెరమీది యాంకర్ అనవసరమైన అమితానందాన్నంతా మొహం మీద ఎడాపెడా పులిమేసుకుని, ముప్పై రెండు పళ్ళూ కనిపించేంతగా నవ్వేస్తూ, ఏదో వింత భాష మాట్లాడుతూ వుంది. అది మన భూమ్మీద మనుషులు మాట్లాడేదేనా అని అనుమానమొచ్చి, చెవులు రిక్కించి వినసాగాను. అప్పుడు అనిపించింది అది మన భాషేనని. తెలుగు, ఇంగ్లీషు భాషల్ని ఏకకాలంలో ఖూనీ చేసేయగల సామర్థ్యం ఈ ఆడ యాంకర్‌కి ఏవిధంగా వచ్చిందా అని నేను తెగ ఆశ్చర్యపోతూ వున్నాను.

ప్రపంచంలో ఏ భాషవాళ్ళయినా టీ.వీ.లలో వాళ్ళ భాషలోనే యాంకరింగ్ చేస్తారు. ఒక్క తెలుగు యాంకర్లు మాత్రమే ఇటు తెలుగూ, అటు ఇంగ్లీషులని కలగలిపి (బహుశా దాన్ని 'తెంగ్లీషు' అనొచ్చా!) కొంగ్రొత్త భాషగా చేసి అలవోకగా మాట్లాడగలరు.

తెలుగు ప్రేక్షకులందరికి ఆంగ్ల వైద్య విజ్ఞానం పంచాలనుకున్నారేమో – భాగ్యనగరం 'గూమ్స్' ఆస్పత్రివారి సహకారంతో "మూత్రపిండాల్లో రాళ్ళు" అన్న అంశాన్ని ప్రసారం చేయడం మొదలుపెట్టారు.

ఈ సబ్జెక్ట్ చూసేందుకు నాకంటే కూడా సరయిన వ్యక్తి పద్మే అనిపించింది. సరిగ్గా ఆ క్షణంలోనే 'నా కర్మ పరిపక్వం' అన్న ప్రక్రియ మొదలయిందని నాకు తెలీదు మరి! నేనైనా ఏం చేయగలను - ఛస్తానా ....

"పద్మా!" అంటూ పిలిచాను - అత్యుత్సాహంగా.

"ఆఁ" అంది. కానీ లోపలినుండి రాలేదు.

"తొందరగా రావే" అంటే మళ్ళీ ....

"ఆఁ ఆఁ" అంది. కానీ బయటికి రాలేదు.

"నువ్వు వెంటనే రాకపోతే - నేను టిఫిన్ చెయ్యను తెల్సిందా?" అన్నాను బెదిరిస్తూ కేక రూపంలో.

"ఆఁ వస్తున్నానండీ - అన్నిటికీ బెదిరింపులే" అంటోంది, కానీ ఎంతసేపటికీ రాలేదు.

'కర్మ' అన్నది పరిపక్వమైపోతూ నన్ను ఊరకనే ఉండనిస్తుందా? తోసుకువెళ్ళింది వంటింట్లోకి.

అంతే - పద్మని చేయి పట్టుకుని బలవంతాన హాల్లోకి లాక్కొచ్చి టీ.వీ. ముందు కుదేశాను.

విసుగ్గా వచ్చి టీ.వీ. ముందు కూచుందేకానీ, మరునిమిషంలో విసుగు మటుమాయం! నోరు తెరుచుకుని ఆ కార్యక్రమాన్ని తదేకంగా చూడసాగింది. మామూలుగా అందులో ఏ కార్యక్రమం వచ్చినా ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ చూడటం ఆవిడ ప్రత్యేకత.

మూత్రపిండాలు ఏవిధంగా పనిచేస్తాయి? వాటి విధులేమిటి? అన్న అంశాన్ని చూపారు.

వాటిలో ఏఏ రకాల రాళ్ళు తయారవుతాయి, ఏఏ ఆకారాలు కలిగి వుంటాయి అన్నది కూడా చూపారు. ఉక్కుముక్కలా ఉండే మనిషి కూడా ఆ కార్యక్రమాన్ని చూశాక అతని గుండెకాయ జానెడు జారి పొట్టలో పడాల్సిందే. ఆ స్థాయిలో చిత్రించారు ఆ ఎపిసోడ్ని.

ఇప్పుడైతే నేను తెలుసుకోగలిగాను కానీ కర్మ పరిపక్వం గురించి - అప్పటికి నాకు తెలీదు కదా మరి... అందుకే మా ఆవిడకి కిడ్నీలకి సంబంధించినటువంటి జ్ఞానాన్ని బలవంతంగానైనా తెలుసుకునేట్టు చేస్తున్నాను కదా అని పదింతలు సంతోషంగానూ ఒకింత గర్వంగానూ వుంది. టీ.వీ తెరనీ, పద్మ మొహాన్నీ మార్చి మార్చి ముచ్చటపడుతూ చూస్తూ వున్నాను.

నేను అట్లా పద్మకి ఆ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చూపించడంలో కొంత ఫ్లాష్ బ్యాక్ వుంది -సుమా!

అదేమిటో వివరంగా చెపుతాను.

సుమారు పదిహేను రోజుల క్రితం ఉదయాన్నే పద్మకి పొత్తికడుపులో భరించలేనంతటి నొప్పి వచ్చింది. నొప్పికి తట్టుకోలేక ఏడ్చేస్తోంది. ఆ నొప్పి రాను

రానూ ఎడమవైపు వీపుపైకి పాకుతోన్నట్లుగా వుందని చెబుతోంది. వెంటనే ఆటోలో గవర్నమెంట్ ఆస్పత్రికి తీసుకెళ్ళేను. అక్కడ స్కానింగ్ తీశారు - ఎక్స్‌రే తీశారు.

పద్మ ఎడమ కిడ్నీలో రాళ్ళు వున్నట్లు తేల్చారు. ఆ విషయం తెలుస్తూనే పద్మకి ఏడుపు ముంచుకొచ్చింది. బాధతో విలవిలలాడిపోయింది.

ప్రతిరోజూ బాగా నీళ్ళు తాగుతూవుంటే రాళ్ళు కరిగిపోయే అవకాశం వుందని డాక్టర్లు చెప్పారు. నొప్పి తగ్గేందుకు ఏవో మాత్రలు కూడా యిచ్చారు.

మాత్రలు బాగా పనిచేయడం వల్లనో, నీళ్ళు బాగా తాగడం వల్ల ఆ రాళ్ళు కరిగిపోయాయో తెలీదుకానీ, మళ్ళీ పద్మకి పొత్తికడుపులో నొప్పి రాలేదు.

పద్మ ఆవిషయాన్నే దాదాపు మరిచిపోయింది.

అయితే నా కర్మ పరిపక్వం కావడం ఇప్పుడే కదా అయిపోవచ్చింది. టీ.వీ.లో చూపిస్తున్న 'కిడ్నీల' కార్యక్రమం అయిపోయింది. దాంతోపాటు పద్మ మొహం ఆరిపోనున్న దీపపుకాంతిలా తగ్గిపోయి వుంది.

"ఆఫీసుకి టైమవుతోంది తొందరగా టిఫిన్ ... అసలే ఆకలి ..." అన్నాను మొహం దీనంగా పెట్టుకుని.

'ఆకలయితే రోకలి మింగు' అన్నట్టు చూసింది. ఆ చూపులో సీరియస్‌నెస్ లేదు... ఆందోళన ఉంది.

యాంత్రికంగా టీ.వీ.ని ఆఫ్ చేశాను.

ఉన్నట్టుండి - "నా ఆరోగ్యం గురించి పట్టదా నీకు" నా కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది పద్మ.

"ఎందుకు పట్టదు?" అని నవ్వాను.

"ఏదోలే, దేవుని దయవల్ల నొప్పి తగ్గిందిలే అని అనుకున్నామా? ఇప్పుడు టీ.వీ.లో చూసిన తర్వాత తెలిసింది - ఒక్కోసారి కిడ్నీలో రాళ్ళు ఎంత లావుగా వున్నా నొప్పి రాకపోవచ్చునంట ... మనం వాటిని గురించి అశ్రద్ధ చేస్తే అవి చెడిపోయే ప్రమాదం కూడా వున్నదంట" అంటూనే కళ్ళల్లో నీళ్ళు కక్కుకుంది పద్మ.

నిజంగా అప్పుడు తెలిసింది కర్మ గురించీ, దాని పరిపక్వత గురించీ - కొంచెం, కొంచెం.

"యూరాలజిస్టు కాడికి పోదామండీ! లేదంటే నా ఆరోగ్యం ..." అంటూ ఆపేసింది 'పాడయి పోతుంది' అని అనలేనంత దుఃఖంతో కంఠం మూసుకు పోయింది. సరేనన్నాను - ఆమె తలమీద చేత్తో దువ్వుతూ.

ఊళ్ళో డాక్టర్లకేం కొదవలేదు. సందుకో డాక్టరు, ఇంటికో డాక్టరున్నాడు. ఇంక యూరాలజిస్టు వుండడా అన్న ధీమా కూడా వుంది అప్పట్లో నాకు.

అప్పటికి నేను ఎంత అజ్ఞానంతో అలరారుతున్నానో మా మిత్రులు చెబుతోంటే కానీ అర్థం కాలేదు. ఏమనీ? ఈ ఊళ్ళో కిడ్నీకేకాదు శరీరంలోని అతి ముఖ్యమయిన ఏ భాగానికి కూడా స్పెషలిస్టులు లేరని.

మరంచేత పద్మని ఏ హైదరాబాదుకో, లేదంటే ఏ బెంగుళూరుకో తీసుకు పోవాల్సిందే - అందుగ్గానూ చేతిలో పదివేల రూపాయలైనా వుండాలి. నేను చూస్తే

సగటు గుమస్తాని. ప్రావిడెంటు ఫండులో అప్పు కోసం అర్జీ పెట్టుకున్నాను. ఆ అప్పు చేతికి రావాలంటే ఎంతలేదన్నా రెండు వారాలయినా పడుతుంది.

★ ★ ★

ఒక సాయంత్రం ఆఫీసు నుంచీ ఇంటికి రాగానే .... "మనం ఎక్కడికీ వెళ్ళాల్సిన పనిలేదంటే! హైదరాబాదు నించీ యూరాలజిస్ట్ డాక్టర్ పరాంకుశం వస్తున్నాడంట మన ఊరికి – టీ.వీ.లో ప్రకటించారు. వచ్చే శనివారమే ఆయన వస్తున్నది" అంది పద్మ ఉత్సాహంగా.

"ఎక్కడంట?" అని అడిగాను.

"అడినోవా హాస్పిటల్ అని కొత్తగా కట్టించినారంటనే అందులోనేనంట" అంది పద్మ.

"అవునా – ఎంతయినా నువ్వు అదృష్టవంతురాలివే. వెదకబోయిన తీగే కాళ్ళదగ్గర కొచ్చింది. అసలు మన అట్లా వాళ్ళు ఆ పెద్ద పెద్ద సిటీలకి పోయి ఆ కార్పొరేట్ ఆస్పత్రులలో చూపించుకోలేమని, వాటి శాఖల్నే మన ఊర్లో పెట్టారు. ఈ 'అడినోవా' హాస్పిటల్‌కి హైదరాబాదు, బెంగుళూరు, చెన్నైల్లో పెద్ద పెద్ద ఆస్పత్రులున్నాయే" అన్నాను. 'కాగల కార్యం గంధర్వులు తీరుస్తారంట' అన్న పెద్దలమాట ఊరకనే పోతుందా!

ఆలస్యం చేయకుండా వెంటనే అడినోవా ఆస్పత్రికి ఫోన్‌చేసి పద్మ పేరు నమోదు చేయించాను. టోకన్ నెంబరు 'ఆరు' అని చెప్పింది రిసెప్షనిస్టు. శనివారం ఉదయం తొమ్మిదింటికల్లా అడినోవాకి తీసికెళ్ళాను.

అర ఎకరమున్న విశాలమయిన స్థలంలో ఆరంతస్తులు కట్టిన భవనమది. చాలా అధునాతనంగా ఉంది. అందులో పనిచేస్తూ వున్న ఆడ, మగ ఉద్యోగులందరూ తెలుపు, లేత నీలంరంగు యూనిఫాంలో వున్నారు. అక్కడ స్వీపరుకూడా శుభ్రమయిన బట్టలు వేసుకుని ఉండటం నాకు ఎంతో నచ్చింది.

రిసెప్షను కౌంటరుకు ఎడమవైపున పెద్ద మెడికల్ స్టోరు వుంది. '24 గంటలూ సర్వీసు చేస్తాం' అన్న బోర్డు తెలుగూ, ఇంగ్లీషు భాషల్లో రాసివుంది.

డాక్టరు ఫీజు నూటా ఏభైరూపాయలూ కౌంటర్లో చెల్లించి వెయిటింగ్ హాల్లో కూచున్నాం నేనూ, పద్మ. అప్పటికే ఏభైమందిదాకా అక్కడ వున్నారు.

పదకొండు గంటలవుతున్నట్టే యురాలజిస్టు డాక్టరు పరాంకుశంగార్ని కలిశాం. పద్మ తన బాధలూ, అనుమానాలూ చెప్పేసింది. పరాకుగానూ, చిరాకుగానూ వున్నారు డాక్టరు పరాంకుశం. గవర్నమెంటు ఆస్పత్రివారు ఇచ్చిన రిపోర్టుల్ని చూపించాం. వాటిని చూస్తూ మరింత పరాకుగా పెదవి విరిచి –

"ఈ రిపోర్టుల్లో ఏమీ తెలీట్లేదండీ! ఈ హాస్పిటల్లో ఇప్పుడు స్కానింగ్ తీయించండి. అట్లాగే ఐ.వీ.పీ. ఎక్స్‌రే కూడా తీయించండి. ఆ రిపోర్టుల్ని చూసి అప్పుడు డయాగ్నయిజు చేస్తాను" అన్నారాయన.

డాక్టరు దగ్గిర చీటీ రాయించుకుని కౌంటర్ దగ్గరకి వెళ్ళాను. స్కానింగ్, ఎక్స్‌రేలకి పదిహేనువందలు ఫీజు కట్టించుకుని – ఖాళీ కడుపుతో మరునాడు రమ్మన్నారు.

"అయ్యో! డాక్టరుగారు ఈ రాత్రికే తిరిగి వెళ్ళిపోతే ఎట్లా?" ఆందోళనగా అంది పద్మ.

నిజమే - డాక్టరుగారితో వున్న విషయం చెప్పాం. అందుకాయన - "ఎస్, ఎస్, ఐ.వీ.పీ. ఎక్స్‌రేని ఖాళీ కడుపుతోనే తీయాలి. రేపు ఇవి రెండూ తీయించుకున్నాక ఈ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ రావుగారికి ఆ రిపోర్టులు చూపించండి. ఆయన నాకు ఫోన్లో అన్ని విషయాలు చెబుతారు. ఓ.కే... ఆ తరువాత ఏం చేయాలో నిర్ణయిద్దాం ... డోన్ట్‌వర్రీ" అభయమిస్తున్నట్లు అన్నారు.

ఆ మరుసటిరోజు మళ్ళీ 'అడినోవా'కి వెళ్ళాం. పద్మ ఖాళీ కడుపుతోనే వుంది. కిడ్నీల ప్రాంతంలో ఐ.వీ.పీ. ఎక్స్‌రే ఫోటోలు అయిందింటిని వివిధ భంగిమల్లో తీశారు. స్కానింగు కూడా తీశారు. అప్పటికే భోజనం లేక గుడ్లు తేలవేస్తున్న పద్మని హోటలుకు తీసుకెళ్ళాను.

మధ్యాహ్నం మూడున్నరగంటలకి ఎక్స్‌రే, స్కానింగ్ రిపోర్టులతోపాటూ 'అడినోవా' హాస్పిటల్ ఛైర్మన్ అయిన డాక్టరు రావు గదికి వెళ్ళాం.

ఆయన్ని చూడగానే పెద్దపులి జ్ఞాపకం వస్తుంది. అచ్చంగా దానికి సూట్ వేసినట్టే వుంది.

మమ్మల్నిద్దర్నీ చూస్తూనే ముచ్చటయిన కుందేళ్ళని చూస్తూ లొట్టలువేస్తూ నవ్వి నవ్వి తన ముందున్న కుర్చీలలో కూచోమన్నట్టు పంజా చూపింది పెద్దపులి.

అదురుతూ, బెదురుతూ కూచుని బెరుకు బెరుకుగా చూస్తూ రిపోర్టుల్ని టేబుల్‌మీద వుంచాను.

తన లావాటి మీసాల్ని సుతారంగా దువ్వుకుంటూ - రిపోర్టుల్ని విహంగ వీక్షణం చేసింది.

పద్మవైపు తిరిగి - 'మిమ్మల్ని ఇప్పుడే తినదల్చుకోలేదు' అన్నట్టు నవ్వి, "ప్లీజ్, మీరు కాస్త బయటికి వెళతారా, మీవారితో కొంచెం మాట్లాడాలి" అంది పులి.

పద్మ ఒక్కసారి షాక్ తిని, బిత్తరపోయి ఆందోళనగా నావైపు చూస్తూ గదిబైటికి వెళ్ళిపోయింది. ఒక్క పద్మకే కాదు నాకూ భయం వేసింది ఆ క్షణంలో - తన సూట్‌ని తీసివేసి అక్కడికక్కడే నన్ను నంజుకోదు కదా!

తన టేబుల్ మీద ఉన్న పర్సనల్ కంప్యూటర్ని ఆన్ చేసింది పెద్దపులి. టపటపమంటూ కీబోర్డు మీదున్న మీటల్ని ఎడాపెడా నొక్కేసింది. దేహంలోని అవయవాలన్నీ చిన్నతెరమీద ప్రత్యక్షమవుతున్నాయి....

కిడ్నీలు బొమ్మరాగానే - పులి కనుబొమ్మల్ని ఒకసారి ఎగరేసి "వీటినే మూత్రపిండాలని అంటారు. ఐ మీన్ కిడ్నీస్ ..." నావైపు చూడకుండానే అవి దేహంలో ఏ ప్రదేశంలో ఉంటాయో వివరంగా చెబుతోంది.

'ఛ ... మాకు తెల్దులే ...' అందామనిపించింది. కిడ్నీల గురించిన విషయాలన్నీ అప్పటికే నాకు కంఠతా వచ్చును. అయినా తెలీనట్లు తలాడిస్తూ నేను. కాసేపు

పాఠమంతా ఏకరువు పెట్టాక, అసలు విషయానికొచ్చిందా పులి. "ఈ రిపోర్ట్సు చూశాక కిడ్నీల్లో రాళ్ళు లేవు అన్న విషయం స్పష్టమయింది. ఎస్! హండ్రెడ్ పర్సెంట్ గ్యారంటీ ఇవ్వగల్ను" అంది - నావైపు కళ్ళెగరేసి నవ్వుతూ.

ఆ పులి మీదపడి కరవదన్న గ్యారంటీ ఆ సమయంలో వుంటే ఎగిరిగంతేసి కేకలు వేయాలన్నంత ఉత్సాహం వచ్చింది.

అయినా, ఈ పులేంటి ఈ మాత్రానికే పద్మని అంతలా హడలు గొట్టేంత బిల్డప్ ఇవ్వాలా! పాపం పూర్ పద్మ ...

"అయితే ఒక్క విషయమండీ ..."

మళ్ళీ ఏమిటీ ఒక్క విషయమంటోందీ పెద్దపులి ... ఏదన్నా ఫిటింగ్ పెడుతూ వుందా కొంపదీసి. ఈ మాట అనుకోగానే గుండెలు ఒక్కసారిగా దడదడలాడాయి.

"ఏమిటి? అదేమిటో చెప్పండి సార్!" అన్నాను బలహీన స్వరంతో ...

"అబ్బే ఏంలేదండీ. డోంట్ వర్రీ! నెమ్మదిగా వినండి - మీ ఆవిడ ఎడమ కిడ్నీలో సిస్టు వుందని నా డౌటు" అంటూ కోరలు కనిపించేలా నవ్విందా పులి - నిశ్శబ్దంగా ...

"సిస్ట్ అంటే?" అర్థం కాలేదు నాకు.

"బుడ్డ లేదా గుల్ల వంటి ఆకారం... మరి అది ట్యూమర్ కావచ్చు. నీటి బుడ్డ కావచ్చు - మరేదైనా కావచ్చు" అంటూ వివరించింది.

నా గుండెల్లో దడ మరీ ఎక్కువైంది. ఇదేమిటీ పద్మకి కొత్త జబ్బు! మాట పెగల్లేదు - మౌనంగా తల పంకించాను.

"నా డౌటు తీరాలంటే మీరు సీటీ స్కానింగు చేయించాల్సి వుంటుంది. ఈ ఫెసిలిటీ మా హాస్పిటల్‌లో లేదండీ! త్వరలో దాన్నీ మేం పెట్టబోతున్నాం. ఇప్పుడు మీరు ఎక్కడైనా 'సీటీ స్కాన్' చేయించండి. ఆ రిపోర్టు తెస్తే, అందులో అది ఏరకమైన సిస్టో తెల్సిపోతుంది. ఈ ఊర్లోనే మా హాస్పిటల్ లాంటిదే 'జడ్విన్' ఉన్నది. అందులో చేయించండి. లెటర్ రాసిస్తా. ఈ రిపోర్టులన్నీ డాక్టర్ పరాంకుశంగారికి ఫోన్‌లో చెబితే హీ విల్ బీ హ్యాపీ. ఏమంటారు?"

నానుండి ఎటువంటి సమాధానం కోసం ఎదురుచూడకుండానే 'జడ్విన్' ఛైర్మన్‌కు లెటర్ రాసిచ్చింది పెద్దపులి.

"ఎంతవుతుంది సార్?" అడిగాను.

"మనిషి ముఖ్యమండీ - ఇట్లాంటి సమయాల్లో ఎంత ఖర్చు అవుతుందని ఆలోచించుకోకూడదు. మీరు అడిగారు కాబట్టి చెబ్తున్నా అయిదువేలదాకా కావచ్చు."

అక్కణ్ణించి బయటికి వచ్చేశాను. వెయిటింగ్ హాల్లో బిక్కుబిక్కుమంటూ నాకేసే చూస్తోంది పద్మ... ఏం చెబుతాడా! అని. ఏం లేదన్నట్టు నవ్వాను. డాక్టరు చెప్పినదంతా పొల్లుపోకుండా చెప్పాను. నా మాటలు నమ్మిన దాఖలాలు ఆవిడ మొహంలో కనిపించకపోగా - "ఇంకేదో చెప్పి వుంటాడు డాక్టరు. నేను

భయపడ్తానని దాస్తున్నావు" అంది కళ్ళలో నీళ్ళతో. ఆమెని నమ్మించాలని ప్రయత్నించే కొద్దీ నేను మరింత విఫలుడినవుతున్నాను. 'సీటీ' స్కాను చేయించకుండా బెంగుళూరులో చూపిద్దామంటే నమ్ముతుందా? ఏమో మరి!

"అరెరే ప్రసాద్ - ఇక్కడున్నావేరా!" అన్నగొంతు విని వెనక్కి తిరిగి చూశాను.

నా చిన్న నాటి మిత్రుడు - మూర్తిగాడు.

మా ఆవిడకి వాడిని పరిచయం చేశాను. ఆ తర్వాత "నువ్వేంటి రా ఇక్కడ?" అంటూ ఎదురుప్రశ్న వేశాను వాడిని.

"అయ్యో ఏమని చెప్పేదిరా! నిన్న కర్నూలుకు క్యాంపుకు పోయినాను. పని వుండి రాత్రికి అక్కడే ఉండిపోయాను. చుట్టపు చూపుగా వచ్చిన మా మామకు నీళ్ళ విరేచనాలు పట్టుకున్నాయి. ఇంటికి దగ్గర అని మా ఆవిడ ఇందులో చేర్పించింది. ఏదో లూజ్ మోషన్స్ అంటే అవి నిలిచేందుకేవయినా టాబ్లెట్లో, కాప్స్యూల్సో ఇస్తారు, రెండు సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తారు ...

ఈడ అట్లా కాదురా. ఆ ముసిలాయనకి ఎండోస్కోపూ, ఆ స్కోపూ, ఈ స్కోపూ అని చెప్పి ఏవో టెస్టులు చేయించి - ఐదు వేలు బిల్లు చేసినారు. నేను ఇప్పుడా డబ్బు కట్టేసి వస్తున్నా" చెప్పాడు మూర్తిగాడు.

మా పరిస్థితి అంతా వాడికి చెప్పాను.

"వీళ్ళని నిందించి లాభంలేదురా! వ్యాపారంతో ముడిపడి వుండే వైద్యంలో జబ్బు కంటే డబ్బుకే ప్రాముఖ్యత ఎక్కువగా వుంటుంది. నా మాట విని పుట్టపర్తికి పో! అక్కడ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వుంది. బాబా మీద భక్తితో అక్కడి డాక్టర్లు అంకిత భావంతో పనిచేస్తారు. అది వాళ్ళ ఇష్టం. మనకి దాంతో సంబంధం లేదు. అక్కడి వ్యవహారం డబ్బుతో ముడిపడదు కాబట్టి నీతిగా, నిజాయితీగా చెప్తారు. నీకు పైసా ఖర్చు వుండదు" అన్నాడు మూర్తి.

మరుసటి రోజే పుట్టపర్తి ఆస్పత్రికి వెళ్ళాం. అక్కడ వున్న యూరాలజిస్టు ఓ కుర్ర డాక్టరు. వచ్చీరాని తెలుగు మాట్లాడతాడు. అతని మాతృభాష తమిళం. పద్మకి ఎక్స్‌రే తీయించాడు. వెంటనే రిపోర్టు తెప్పించుకుని చూసి చెప్పాడు. "మీరు ఏమీ భయపడే పనిలేదు. మొదలు స్కానింగ్ తీసినపుడు రాళ్ళు వుండినాయేమో. మీరు నీరు బాగా తాగినందువల్ల అవి పూర్తిగా కరిగిపోయినాయి. మీకు ఏం ప్రాబ్లం లేదు. ఏ మాత్రలూ వాడే పని కూడా లేదు."

అతను చెప్పింది విన్న పద్మ మొహంలో వేయి దీపాల వెలుగులు.

(స్వాతి వీక్లీ - 19 డిసెంబర్, 2003)